

# సంసారంలో సరిగమలు - తమస్విని



*(ప్రతి సంసారంలోనూ వినిపించే రాగాలు..*

*కొన్ని సరదాలు, కొన్ని సరాగాలు,*

*కొన్ని సరసాలు, ఇంకొన్ని విరసాలు, మరికొన్ని విషాద గీతాలు..*

*వెరసి సంసారంలో సరిగమలు..!)*

## నాలాగా ఎందరో!

**సంధ్యకి** గాల్లో తేలిపోతున్నట్లుంది. ప్రపంచాన్నే జయించినట్లుంది. సంతోషం ఆమె ముఖంలో ప్రస్ఫుటంగా కనిపిస్తోంది. కొలీగ్స్ అంతా కంగ్రాట్స్ చెప్తున్నారు. ఆమె ఫోన్ అందుకుంది. 'అమ్మకి చెప్పాలి మొదటగా' అనుకుంది. లేదు లేదు. ఫస్ట్ ఉపేంద్రకి చెప్పాలి. మరో క్షణం ఆలోచించి ఫోన్ డెస్క్‌మీద పెట్టేసింది. 'ఇంత శుభవార్త ప్రత్యక్షంగా చెప్పాలి. ఉప్పీ రియాక్షన్ ఏమిటో చూడాలి' అనుకుంది మురిపెంగా. నిమిషం తర్వాత మనసు ఆగక తల్లికి ఫోన్ చేసింది.

"అమ్మా! నేను" చెప్పింది.

"ఏంటి తల్లీ ఇప్పుడు ఫోన్ చేసావు? అంతా బాగేగా?" తల్లి ఆదుర్దాగా అడిగింది.

"అంతా బాగే అమ్మా. నీకో శుభవార్త చెప్దామని ఫోన్ చేసాను."

"శుభవార్తా? ఎన్నో నెల?" ఆవిడ ఆనందంగా అడిగింది.

"నీకెప్పుడూ పిల్లల ధ్యాసేనా అమ్మా. నాకు ప్రమోషన్ వచ్చింది. ఫస్ట్ నీకే చెప్తున్నాను."

"ప్రమోషనా? నీకు రాక ఎవరికి వస్తుంది? ఆర్నెల్ల క్రితం కూడా వచ్చిందిగా"

"ఏడాది క్రితం. అది చిన్న ప్రమోషన్. ఇది చాలా పెద్ద పొజిషన్."

ఆవిడ సంతోషంగా నవ్వింది.

"మీ నాన్నకి ప్రమోషన్ వచ్చినప్పుడు సాయంత్రం ఇంటికి స్వీట్ పాకెట్‌తో వచ్చేవారు. నాకు సినిమాలంటే ఇష్టం కదా! ఈ శుభ సందర్భంలో సినిమాకి వెళ్దాం అనేదాన్ని. ఆయన స్వీట్ పాకెట్ తెచ్చినా పాయసం వండేదాన్ని. మీ నాన్నకి నేను చేసిన సగ్గుబియ్యం పాయసం అంటే చాలా ఇష్టం. సెకండ్ షో సినిమాకి వెళ్ళేవాళ్ళం. సినిమా అయ్యాక నిద్రపోతున్న మిమ్మల్ని భుజానేసుకుని నడుచుకుంటూ ఇంటికి వచ్చేవాళ్ళం. అలంకార్ టాకీస్ మనింటికి దగ్గరేగా. ఆ పూటంతా ఆనందంగా గడిచేది."

"ఐతే సగ్గుబియ్యం పాయసం చేసి నాన్నకి పెట్టి చెప్పమ్మా సంధ్యకి ప్రమోషన్ వచ్చిందని. సరేనా? ఇంక పనిచేసుకుంటా." సంధ్య చెప్పి ఫోన్ పెట్టేసింది.

ఎదురుగా తేజ నవ్వుతూ స్వీట్ బాక్స్‌తో కనపడ్డాడు. పక్కనే రవళి.

"ఏంటి మా నాన్నలాగా? నీకూ ప్రమోషన్ వచ్చిందా?" ఒక స్వీట్ అందుకుంటూ అడిగింది సంధ్య.

"నాకు రాలేదు. నా డార్లింగ్‌కి వచ్చింది" తేజ నవ్వాడు.

"నాకు ప్రమోషన్ వస్తే మా తేజ స్వీట్స్ పంచుతున్నాడు. అబ్బాయ్ గారికి తమ కెరీర్ మీద శ్రద్ధలేదు" రవళి చెప్పింది.

ఇద్దరూ పక్క క్యూబికల్‌కి వెళ్ళారు.

సంధ్య త్వరగా ఇంటికి వచ్చి శుభ్రంగా ఉన్న ఇంటిని మరోసారి పైపైన సర్ది స్నానం చేసి శ్రద్ధగా తయారైంది. ఉపేంద్ర ఎప్పట్లాగే ఆరింటికల్లా వచ్చాడు. సంధ్యని చూసి కళ్ళెగరేసి అడిగాడు.

"ఏమిటి విశేషం?"

"ఉప్పీ! నాకు ప్రమోషన్ వచ్చింది" సంధ్య ఆనందంగా చెప్పింది.

"మొన్నేగా ఒకటి వచ్చింది? మీ ఆఫీస్‌లో ఇంక పనిచేసేవాళ్ళెవరూ లేరా?" ఉపేంద్ర షర్ట్ బటన్స్ విప్పుకుంటూ అడిగాడు.

"అది బుజ్జి ప్రమోషన్. ఇది చాలా పెద్దది. నెట్‌వర్క్ మేనేజర్. గ్లోబల్ పొజిషన్ 24/7 జాబ్."

"ఓ.. ఉపేంద్ర ఉదాశీనంగా చెప్పి బాత్ రూంలోకి వెళ్ళిపోయాడు.

సంధ్య హాల్లో నుంచుండిపోయింది. ఆమె భర్త నించి ఈ రియాక్షన్‌ని ఊహించలేదు. అతను మెచ్చుకుంటాడని, తల్లిలాగా 'నీకు కాక ఇంకెవరికి వస్తుంది' అంటాడని ఊహించింది.

"సంధ్యా. ఆకలి. ముందు కాఫీ ఇస్తావా?" ఉపేంద్ర టవల్‌తో ముఖం తుడుచుకుంటూ అడిగాడు.

సంధ్య నిశ్శబ్దంగా వంటగదిలోకి వెళ్ళింది.

"డిన్నర్‌కి బయటకి వెళ్దామా?" కాఫీ కప్ అందిస్తూ అడిగింది.

"నాకు రేపు ఆఫీస్‌లో అర్జెంట్ పనివుంది. త్వరగా వెళ్ళాలి. ఏదో ఒకటి వండెయ్. త్వరగా పడుకుందాం" చెప్పాడు.

సంధ్య మళ్ళీ వంటగదిలోకి వెళ్ళిపోయింది. వంట చేస్తూ ఉపేంద్ర ప్రవర్తన గురించి ఆలోచించింది. అతను ప్రమోషన్ వచ్చిందని చెపితే, తనంత ఉదాశీనంగా ఉంటుందా? తనకే వచ్చినట్లు పొంగిపోయేది. సెలబ్రేట్ చేసేది. ఆమె కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి.

నిశ్శబ్దంగా భోజనం చేసి పదింటికల్లా అటువైపు తిరిగి పడుకున్నాడు ఉపేంద్ర. సంధ్యకి చాలాసేపటిదాకా నిద్రపట్టలేదు.

ఎప్పట్లా ఆలస్యంగా ఎనిమిదిగంటలకి లేచిన ఉపేంద్రకి కాఫీ అందిస్తూ అడిగింది సంధ్య.

"అర్జెంట్ పని ఉందన్నారు?"

"పర్లేదు పదింటికి వెళ్ళినా చేసుకోగలను" అతను ఫోన్ చూసుకుంటూ చెప్పాడు.

"సరే. నేను వెళ్తున్నా" సంధ్య బేగ్ అందుకుంది.

"సంధ్యా. ఉపేంద్రగారు ఏమన్నారు రాత్రి? ఆమె మధుర రాత్రులా?" రవళి కన్నుగీటి అడిగింది.

సంధ్య చిరునవ్వు నవ్వింది. జవాబు చెప్పలేదు.

ఆమెకి ఉపేంద్ర ప్రవర్తనకి ఉక్రోషంగా ఉంది. 'కుళ్ళు' అనుకుంది. 'అసూయ' అనుకుంది. 'ఓర్వలేడు' అనుకుంది. ఎన్ని అనుకున్నా ఆమెకి ఉక్రోషం తగ్గలేదు.

ఇంటికి వచ్చేసరికి ఉపేంద్ర ఓ నలభై ఏళ్ళతనితో మాట్లాడుతున్నాడు.

"తను నా వైఫ్ సంధ్య అండీ. సంధ్యా వీళ్ళు మన పక్క ఫ్లాట్‌లోకి వచ్చారట" పరిచయం చేసాడు.

"హలో మేమ్. నా పేరు వటపత్రశాయి. హెచ్.డి.ఎఫ్.సిలో పని చేస్తాను. నైన్ నాట్ సెవన్‌లోకి వచ్చాం." అతను లేచి నిలబడి చెప్పాడు.

"హలో శాయిగారూ. మీ పేరు తమాషాగా ఉంది" సంధ్య నవ్వి చెప్పింది.

"అవును నాక్కూడా తమాషాగానే ఉంటుంది" అతను నవ్వాడు.

"ఒన్ మినిట్" చెప్పి సంధ్య లోపలికి వెళ్ళి డ్రెస్ మార్చుకుని కాఫీ కప్పులతో వచ్చింది.

"మీకు టి.వి ఏంకర్ శైలారాణి తెలుసా?" శాయి కప్ అందుకుంటూ అడిగాడు.

"పర్సనల్‌గా తెలీదు కాని తెలుసు. మనిషి బావుంటుంది. ఉచ్చారణకూడా బాగుంటుంది" సంధ్య చెప్పింది.

"తను నా బెటర్ హాఫ్. అవును. తెలుగు చక్కగా మాట్లాడుతుంది." శాయి చెప్పాడు.

"వావ్! మా బిల్డింగ్‌లోకి ఒక సెలెబ్రిటీ వచ్చారన్నమాట" ఉపేంద్ర చెప్పాడు.

"మా ఫ్రెండ్స్ 'నీకిక విజిటింగ్ కార్డ్ అక్కర్లేదురా. మీ ఆవిడ పేరే నీకు విజిటింగ్ కార్డ్' అంటారు" శాయి నవ్వుతూ చెప్పాడు.

సంధ్య చేతిలోని కాఫీ కప్పుని టీపాయ్ మీద పెట్టి రెండు చేతులతో అతనికి నమస్కరిస్తూ చెప్పింది.

"మీ వైఫ్ సక్సెస్‌ని మీ విజయంలా చెప్తున్నారు. మీరు గ్రేట్ శాయిగారూ."

"అయ్యో! అందులో ఏముందండీ. మీ అఛీవ్‌మెంట్స్‌కి ఉపేంద్రగారు పొంగిపోరా ఏమిటి?" శాయి సిగ్గుపడుతూ చెప్పాడు.

సంధ్య భర్తవంక చురుగ్గా చూసింది. ఉపేంద్ర భార్యవంక చూడలేదు.

ఆ రోజు సంధ్య ఆఫీస్ నించి రాగానే గబగబా తయారైంది. ఉపేంద్ర భార్య హడావిడిని గమనిస్తున్నా ఏం మాట్లాడలేదు. ఆమె పట్టుచీర కట్టుకోవడం చూసి చివరికి అడిగాడు.

"ఏమిటీ హడావిడి? ఇంకో ప్రమోషన్ వచ్చిందా?"

"ఉప్పీ ప్లీజ్. సర్కాస్టిక్‌గ మాట్లాడితే నాకు చిరాకని నీకు తెలుసు. సునంద వరలక్ష్మీవ్రతం చేసుకుందిట. పేరంటానికి వెళ్తున్నాను" సంధ్య మేచింగ్ చెప్పులు వెతుక్కుంటూ చెప్పింది.

"నీచేత ఆ వ్రతం చేయించాలని పాపం మా అమ్మ మూడేళ్ళు పోరాడింది. నువ్వే గెలిచావనుకో" ఉపేంద్ర వ్యంగ్యంగా చెప్పాడు.

"నాకు కుదరదు. అదీకాక నేను ఎథీస్ట్‌నని నీకు తెలుసు. ఇప్పుడు వెళ్తోంది కూడా స్నేహం కోసం. అది దేవుడికి దణ్ణం పెట్టుకో అంటే పెట్టుకుంటా. కాకపోతే భక్తి ఉండదు. కాని భక్తి లేకుండా చేసే పూజకోసం సెలవు పెట్టమంటే పెట్టను. ఓ పట్టుచీర, ఓ నగ, ఇంకా తమలపాకులు, అరటిపళ్ళు ఆదా అనుకో" చెప్పి బయటకి నడిచింది.

సునంద ఇంట్లో హాల్లో పేరంటాళ్ళు కూర్చుని ఉన్నారు. కొందరు గోడవారకి వేసిన సోఫాల్లో కూర్చుంటే, కొందరు కిందవేసిన కార్పెట్ మీద కూర్చున్నారు. కార్పెట్ మీద కూర్చున్న జయని చూసి నవ్వి అటువైపు నడిచి ఆమె పక్కన కూర్చుంది సంధ్య.

సోఫాలో కూర్చున్న ఒకావిడ సంధ్యకి విచిత్రంగా అనిపించింది. మెడనిండా నగలు, తళతళ మెరిసే పట్టుచీర, ముఖ్యంగా మొహంలో అతిశయం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. వయసు ఏభై పైనే ఉంటుంది.

"సంధ్యా వచ్చావా? రాకపోతే నీతో పలికేదాన్నేకాదు. అయ్యో కింద కూర్చున్నావా? పోనీ సోఫాలో కూర్చోరాదు?" సునంద హడావిడిగా మాట్లాడుతూ, సోఫాలోని ఆవిడ దగ్గిరకెళ్ళి వంగి వినయంగా చెప్పింది.

"ఇంకో పావుగంట. ఇంకా ఒకరిద్దరు రావాలి."

ఆవిడ ఫర్వాలేదన్నట్లుగా తలూపింది. సునంద హడావిడిగా లోపలికి వెళ్ళిపోయింది.

"ఆవిడెవరు ఇంత దాకా చూడలేదు?" జయని అడిగింది.

"వాళ్ళాయన భద్రాచలం కలెక్టరట. సునందకి ఈ మధ్యనే పరిచయమైందిట. ఎంత పొగరనుకున్నావు? సునంద మమ్మల్ని పరిచయం చేసినా పలకరింపు నవ్వులేదు మొహంలో. తనే కలెక్టర్ అన్నంత పోజ్" జయ కోపంగా చెప్పింది.

"ఆవిడని చూస్తే పెద్దావిడలాగుంది. వాళ్ళాయన ఇప్పుడు కలెక్టర్ ఏమిటి?" సంధ్య ఆశ్చర్యంగా అడిగింది.

"అదే! ప్రమోషన్‌తో ఐఏఎస్ వచ్చిందిట. రిటైరయ్యేముందు. ఆయన సంగతేమోగానీ ఈవిడకి అహంకారం పెరిగిపోయింది." జయ ఈసడింపుగా చెప్పింది.

తాంబూలం తీసుకుని వచ్చేసింది సంధ్య.

ఆ రాత్రి సంధ్యకి చాలాసేపు నిద్రపట్టలేదు. బాల్కనీలోకి వెళ్ళి నుంచుంది. పదకొండుదాటినా ట్రాఫిక్ తగ్గలేదు. బహుశా ఫ్రైడే అనేమో అనుకుంది.

ఆ కలెక్టర్ భార్య ప్రవర్తన ఆమెకి ఏదో చెప్తున్నట్లుగా అనిపించింది. ఆడ, మగ సమానం అంటారు. అదో తృప్తి. కానీ కాదు. మగవాడే అధికుడు. భర్తకి ప్రమోషన్ వస్తే పాయసం వండే అమ్మ, భర్త కలెక్టర్ అవగానే అహంభావిగా మారిన ఆవిడ, ఉపేంద్రకి ప్రమోషన్ వస్తే 'వావ్ పార్టీ' అనే తను, ఇంకా పేపర్లలో చదివిన అనేకమంది స్త్రీలు - ప్రొడ్యూసర్స్ భార్యలు, హీరోల భార్యలు, మంత్రుల భార్యలు - భర్తల విజయాన్ని తమ విజయంగా భావించి గర్వించేవాళ్ళు.

భార్యల విజయానికి ఎంతమంది మగాళ్ళు గర్విస్తారు? ప్రోత్సహిస్తారు? తేజ, వటపత్రశాయిలాంటి అరుదైన మగాళ్ళు తప్ప ఏ సగటు మగాడూ భార్య విజయాన్ని తనదిగా భావించడు.

సినిమాల్లో, బిజినెస్‌లో, కళల్లో రాణించిన ఎంతమంది స్త్రీలకి ఇంట్లో మనశ్శాంతి ఉంది? అసూయ అనేది ఇంట్లోనే మొదలైతే వాళ్ళు తమ రంగాల్లో ఎలా ముందుకి వెళ్ళగలుగుతారు? చాలా విడాకులకి ఇది కూడా ఒక కారణమా?

ఉపేంద్ర మంచివాడే కానీ భార్య తనకంటే తక్కువగా ఉండాలి. అమాయకంగా ఉండాలి. తెలివితేటలు ప్రదర్శించకూడదు. తనచుట్టూ ఉపగ్రహంలా తిరగాలి కానీ స్వయంగా ప్రకాశించకూడదు. ఈ కారణాలు చెప్పి అతన్ని

వదిలేయలేదు. తనలాంటి రాజీలు ఈ సమాజంలో ఎందరో! ఆ బలహీనతలని ప్రేమిస్తే ఉపేంద్ర మీద కోపం తగ్గుతుందేమో అనుకుంది.

"సంధ్యా! ఎక్కడున్నావ్? ఇంకా నిద్రపోలేదా?" ఉపేంద్ర కంఠం వినిపించింది.

"వస్తున్నా" లోపలికి వచ్చి బాల్కనీ తలుపు మూసింది.

"ఇంకా పడుకోలేదా? ఓ! నీది 24/7 జాబ్ కదా? ఏ దేశంలో వాళ్ళు నిద్రలేచారు?" ఉపేంద్ర వ్యంగ్యంగా అడిగాడు.

"నీ జికె పెంచుకోవాలి. చాలా దేశాల్లో మధ్యాహ్నమైంది" నవ్వుతూ చెప్పి సంధ్య భర్త పక్కన పడుకుని దుప్పటి పంచుకుంది.

*(వచ్చే సంచికలో మరో సరిగమ)*

Click here to share your comments